బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 08 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో తీర్పు వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ తరపున ఎన్నికై కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం)పై స్పీకర్ అనర్హత వేటు వేసేలా అసెంబ్లీ కార్యదర్శికి ఉత్తర్వులు జారీచేయాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. దీంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం ప్రకటించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన ఈ పిటిషన్లపై హైకోర్టు లోతుగా విచారణ జరిపింది. పిటిషనర్లు స్పీకర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన 10 రోజులకే హైకోర్టును ఆశ్రయించారని దానం, కడియం తరఫు న్యాయవాదులు తెలిపారు. గతంలో జరిగిన ఫిరాయింపులకు సంబంధించి కాంగ్రెస్ నాయకులు దాఖలు చేసిన పిటిషన్‌లో స్పీకర్‌కు నిర్ధిష్ట గడువు నిర్ణయించేందుకు ఇద్దరు న్యాయమూర్తుల హైకోర్టు ధర్మాసనం నిరాకరించిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తాజా పిటిషన్లను కొట్టేయాలని, లేనిపక్షంలో ఆ పిటిషన్లను డివిజన్ బెంచ్‌కి నివేదించాలని కోరారు. దీనిపై పిటిషనర్ల తరపు న్యాయవాదులు గతంలోనే వాదన వినిపించారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్‌కు నోటీసులు జారీ చేయవచ్చని మణిపూర్ ఎమ్మెల్యేల కేసులో

వివరాలు 2వ పేజీలో

## తెలంగాణలో నేడు భారీ వర్షాలు.



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బుధవారం నుంచి గురువారం వరకు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది.

గురువారం నుంచి శుక్రవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రెండురోజులు ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 నుంచి కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ములుగు, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా జోగులాంబ గద్వాల జిల్లా ఘట్టులో 126 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది.

## నిజాం కళాశాలలో చీకట్లోనూ విద్యార్థినుల ఆందోళన



**బలగం టీవీ, హిమాయత్‌నగర్**

హైదరాబాద్ నిజాం కళాశాలలో యూజీ విద్యార్థినుల ఆందోళన ఉధృతం అవుతోంది. కళాశాల హాస్టల్‌లోని సగం సీట్లు పీజీ విద్యార్థులకు కేటాయిస్తూ ప్రిన్సిపాల్ సర్క్యులర్ జారీ చేయడంపై విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఉదయం నుంచి ధర్నా చేపట్టిన విద్యార్థులు అర్ధరాత్రి అయినా కొనసాగించారు. కాలేజీ ప్రిన్సిపల్ తమ డిమాండ్లను పట్టించుకోకుండా డిగ్రీ విద్యార్థినిలకు 50 శాతం, పీజీ విద్యార్థినులకు 50 శాతం కేటాయిస్తామని సర్కులర్ విడుదల చేశారని విద్యార్థులు మండిపడ్డారు. సర్క్యులర్‌ను వెనక్కి తీసుకునే వరకు తమ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. గత 5 రోజులుగా పోరాటం చేస్తున్నా కూడా ప్రిన్సిపల్ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థినులు మండిపడుతున్నారు. సర్క్యులర్ వెనక్కి తీసుకోకపోతే రేపు కాలేజీ ఆవరణలో వంటావార్పు చేపడతామని వారు హెచ్చరించారు. పీజీ విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీలో హాస్టల్ సౌకర్యం ఉందని, డిగ్రీ విద్యార్థులకు నిజాం కాలేజీ వసతి గృహంలోనే పూర్తి స్థాయిలో కేటాయించాలని అప్పటి వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# నీట మునిగిన భద్రాచలం

- పట్టణంలో భారీ వర్షాలు..
- ఆలయ పరిసరాల్లోకి, పలుచోట్ల రోడ్లపైకి వరద నీరు

**బలగం టీవీ, హైదరాబాద్**





భద్రాచలం పట్టణంలో కురిసిన భారీ వర్షంతో పలుచోట్ల వరద నీరు నిలిచి ఇబ్బందులు తలెత్తాయి. ప్రధానంగా అయ్యప్ప కాలనీ, ఏఎస్ఆర్ కాలనీ, రామాలయం ప్రాంతంలో వరద నీరు రోడ్లపైకి వచ్చాయి. రామాలయ విస్తా కాంప్లెక్స్ వద్ద స్లూయిస్ గేట్ల వద్ద ఉన్న మోటార్లను ఆరంభించకపోవడంతో, బ్యాక్ వాటర్ ఒత్తిడి పెరగటంతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. రామాలయానికి పడమర వైపు మార్గమంతా వరద నీటితో నిండిపోయింది. రామాలయ నిత్య అన్నదాన సన్నిధిలోకి కూడా నీరు చేరింది. సుమారుగా అడుగుమేర నీరు చేరటం కనపడింది. పడమర మార్గం నుంచి మిథిలా స్టేడియం వరకు వరద నీరు ఆగిపోయింది.

అయ్యప్ప కాలనీలో సైతం వరద నీరు చేరగా, కాలనీవాసులు భయభ్రాంతులకు గురై సామాజిక మాధ్యమాల్లో కాలనీని కాపాడాలంటూ విన్నపం చేశారు. ఎల్ఐసి ఆఫీస్ మార్గం నుంచి ఏఎస్ఆర్ కాలనీకి వెళ్లే మార్గంలో మురుగునీరు రోడ్లపైకి చేరింది. ఈ ప్రాంతంలోకి పట్నంలోని పలుచోట్ల నుంచి వచ్చే వరదనీరు, మురుగునీరు చేరుతుంది. అయితే దిగుకుకు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఇక్కడ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజ్ వ్యవస్థ వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులకు, ఎమ్మెల్యేకు వినతులు అందించినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా మంత్రి తుమ్మల సైతం రాములయ్య ప్రాంతంలో బ్యాక్ వాటర్ సమస్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆలయం చుట్టూ నీరు**

భారీ వర్షాలకు రామాలయం చుట్టూ నీరు చేరింది. గోదావరి నది బ్యాక్ వాటర్ కి తోడు భారీ వర్షపు నీరు తోడవ్వడంతో భద్రాద్రి పట్టణంలోకి వరద నీరు దూసుకొస్తోంది. ప్రస్తుతం 33 అడుగుల వద్ద గోదావరి ప్రవహిస్తోంది. నదీ ప్రవాహం 53 అడుగులకు చేరి మూడో ప్రమాద హెచ్చరిక జారీ అయిన సమయంలో కూడా పట్టణంలోకి నీరు చేరలేదు. కానీ ప్రస్తుతం బ్యాక్ వాటర్ పట్టణంలోకి వచ్చి చేరుతుంది. దీంతో రామాలయం పరిసర ప్రాంతాలు మొత్తం నీటితో మునిగాయి.

ఆలయంలోని అన్నదాన సత్రం చుట్టూ వరద నీరు చేరింది. విస్తా కాంప్లెక్స్ వద్ద దుకాణాల్లోకి నీరు చేరింది. గోదావరి కరకట్ట సూయిజ్ లు మూసి వేయడంతో నడుముల లోతు నీరు చేరింది. దేవాలయ పరిసర కాలనీలతో పాటు లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. దీంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే ఇరిగేషన్ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మంత్రుల ఆరా..**

భద్రాచలం పట్టణంలోకి నీరు చేరుతున్న విషయంపై జిల్లాకు చెందిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీస్తున్నారు. పట్టణ ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా చూడాలని వారు అధికారులను ఆదేశించారు. బాహుబలి మోటార్ల ద్వారా నీటిని నదిలోకి ఎత్తి పోయాలని సూచించారు. అయితే మోటార్లు సరిగా పని చేయకపోవడంతో కాస్త ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది.



## రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు

- 50 కేజీల కంటే 100 గ్రాములు ఎక్కువుందని వేటు
- భారత్ అభిమానులను షాక్‌కు గురిచైసిన నిర్ణయం
- వినేశ్‌కు అస్వస్థత అంటూ వార్తలు

వివరాలు 4వ పేజీలో

## భారత జట్టు ఘోర ఓటమి

**110 పరుగుల తేడాతో శ్రీలంక విజయం**

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్‌తో బుధవారం జరిగిన మూడో వన్డేలో ఆతిథ్య శ్రీలంక టీమ్ 110 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో శ్రీలంక మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 20తో సొంతం చేసుకుంది. తొలి వన్డే టైగా ముగియగా, తర్వాత రెండు మ్యాచుల్లో లంక జయకేతనం ఎగురవేసింది. మూడో వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 248 పరుగులు చేసింది. ఓపెనర్లు పాథుమ్ నిసాంకా, అవిష్క ఫెర్నాండో జట్టుకు శుభారంభం అందించారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన నిసాంకా ఐదు ఫోర్లు, రెండు సిక్స్‌లతో 45 పరుగులు చేశాడు. ఫెర్నాండో 102 బంతుల్లో 9 ఫోర్లు, రెండు సిక్సర్లతో 96 పరుగులు చేసి ఔటయ్యాడు.

వివరాలు 4వ పేజీలో

## ఫ్రాడ్ పనులు సీఎం రేవంత్ మానుకోవాలి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న రేవంత్ రెడ్డి ఫ్రాడ్ పనులు మానుకోవాలని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ హెచ్చరించారు. రేవంత్ రెడ్డి తమ్ముళ్ళ దందాల కోసం అమెరికా వెళ్లాడు అని క్రిశాంక్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో క్రిశాంక్ మీడియాతో మాట్లాడారు.

తెలంగాణలో రూ. 1000 కోట్లతో పెట్టుబడి పెడుతామన్న స్వచ్ బయో అనే కంపెనీ రేవంత్ రెడ్డి తమ్ముడిది. వీళ్ల బినామీ హర్ష పసునూరి అనే ఒక సాఫ్ట్ వేర్ ఉద్యోగితో ఎంఓయూపై సంతకం పెట్టించి, 15 రోజుల కింద పెట్టిన కంపెనీ నుండి రూ. 1000 కోట్ల పెట్టుబడులు తెస్తున్నామని చూపిస్తున్నారని క్రిశాంక్ తెలిపారు. సీఎం స్థాయిలో ఉండి వేల కోట్ల ఒప్పందాల పేరిట తన సోదరులను సెటిల్ చేసేందుకు యత్నిసున్నాడు. ఒకరిదరు కాదు ఏకంగా 30 మంది అధికార

వివరాలు 4వ పేజీలో

## కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి వరుస భేటీలు



- హైదరాబాద్ అభివృద్ధికి సహకరించండి
- ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడికి సీఎం రేవంత్ విజ్ఞప్తి

**బలగం టీవీ, హైదరాబాద్**

: అమెరికాలో సీఎం రేవంత్ పలు కంపెనీల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహిస్తూ, పెట్టుబడుల అగ్రిమెంట్స్ చేసుకుంటోంది. మంగళవారం ప్రముఖ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్‌తో ఒప్పందం చేసుకున్న సీఎం రేవంత్ బృందం, తాజాగా మరికొన్ని ఫార్మా కంపెనీలతోనూ డీల్ కుదుర్చుకుంది. ఈ క్రమంలోనే ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో సీఎం సమావేశమయ్యారు.

రాష్ట్రంలో పెట్టుబడులే టార్గెట్‌గా సీఎం రేవంత్‌రెడ్డి టీమ్ అమెరికాలో బిజీబిజీగా పర్యటిస్తోంది. న్యూయార్క్ పర్యటన తర్వాత వాషింగ్టన్ చేరుకున్న సీఎం రేవంత్ బృందం బుధవారం ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాతో సమావేశమైంది. చర్చల్లో భాగంగా హైదరాబాద్ 4.0 అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని అజయ్ బంగాను కోరింది. మూసీ పునరుద్ధరణ, ఫ్యూచర్ సిటీ, స్కిల్ డెవలప్?మెంట్ ప్రాజెక్టులను సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు వివరించారు.

అంతకముందు వివిధ ఫార్మా కంపెనీలతో భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి బృందం, ప్రధాన పెట్టుబడులను ఆకర్షిస్తూ పలు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలలో అత్యాధునిక పరిశోధన, అభివృద్ధి కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకే పలు కంపెనీలు భాగస్వామ్యమయ్యాయి. ఈ క్రమంలోనే వివింట్ ఫార్మా ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు జరిపారు. రూ.400 కోట్లతో వివింట్ ఫార్మా విస్తరణకు కంపెనీ ప్రతినిధులు అంగీకారం తెలిపారు. జీనోమ్ వ్యాలీలో ఇంజక్షన్ల తయారీ కంపెనీ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

: రాష్ట్రానికి ఫార్మా గ్లాస్ ట్యూబ్‌ల తయారీ కేంద్రం రానుంది. మెటీరియల్ సైన్స్ రంగంలో ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన కార్నింగ్ ఇన్‌కార్పొరేటేడ్ కంపెనీ తెలంగాణలో కొత్త ఆవిష్కరణల అభివృద్ధికి ముందుకు వచ్చింది. వివిధ కంపెనీలతో భాగస్వామిగా నూతన సాంకేతిక ఆవిష్కరణలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు కార్నింగ్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్, పరిశ్రమలశాఖల మంత్రి శ్రీధర్‌బాబు చర్చలు జరిపారు.

అనంతరం ఆ సంస్థతో అధికారికంగా అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. 2025 నుంచి ఇందులో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమిస్తామని ప్రకటించారు. కాగా నైపుణ్యాలు, పరిశ్రమల్లో టెక్నాలజీ ఆవిష్కరణల అభివృద్ధికి దోహదపడనుంది. ఔషధాల ప్యాకేజింగ్ పరిశ్రమలో ఈ గ్లాస్ ట్యూబ్‌లను ఉపయోగిస్తారు. వీటి తయారీకి వినూత్నమైన వెలాసిటీ గ్లాస్-కోటింగ్ టెక్నాలజీని ఈ కంపెనీ వినియోగిస్తోంది. దీంతో రాష్ట్రంలో ఇప్పటికే వేగంగా విస్తరిస్తున్న ఫార్మాస్యూటికల్ రంగంలో ఉత్పాదకత సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఎంబీబీఎస్‌లో ప్రవేశాల కోసం తమిళనాడు మాదిరి రూల్స్ ఫ్రేమ్ చేయండి

- ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశాల కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 33పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఇంటర్‌కు ముందు విద్యాసంవత్సం నుంచి వెనక్కి నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడ లోకల్ అని కొత్త జీవోలో చెప్పారు. గత ఏడేళ్లలో కనీసం నాలుగేళ్లు అని పాత నిబంధన చెప్తోంది. ఈ ప్రభుత్వం ఏడేళ్లు తీసేసి నాలుగేళ్లు అంటోంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఈ ప్రకారం తెలంగాణ విద్యార్థులు ఇంటర్ రెండేళ్లు వేరే రాష్ట్రంలో చదివితే, లాంగ్ టర్మ్ కోచింగ్‌కు వెళ్తే నాన్ లోకల్ అయిపోరా? మన తెలంగాణ బిడ్డలు వేరే దేశాలో

మిగితా 2వ పేజీలో

## త్వరల్లో తమ్మిడిహట్టి పనులు ప్రారంభం



- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్**

భట్టి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో తమ్మిడిహట్టి బరాజ్ పనులను త్వరలో ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్రిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి రూ.17 వేల కోట్లను కేటాయించినట్టు తెలిపారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, ప్రేమ్‌సాగర్‌రావు, వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం పాల్గొన్నారు.

పిప్రిలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో పలు గ్రామాల రైతులు సమస్యలతో కూడిన బ్యానర్ ఏర్పాటు చేసి స్వాగతం పలికారు. 'మా గోస తీర్చండి సారూ' అంటూ ఇచ్చోడ నుంచి పిప్రి వెళ్లే మార్గంలో ఆడేగాం వద్ద బ్యానర్ ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారిపై కట్టిన ఈ బ్యానర్ సభకు వచ్చే వారు ఆసక్తిగా గమనించారు.

## తప్పుడు వార్తలు ప్రసారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం



- బీజేపీలో బీఆర్ఎస్ విలీనం లేదు : కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం లేదు.. అలా తప్పుడు వార్తలు ప్రసారం చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ పైన, విలీనం లాంటి ఎజెండా పూరిత దుష్ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, వ్యక్తులు వెంటనే ప్రజలకి వివరణ ఇవ్వాలి. లేదంటే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని కేటీఆర్ హెచ్చరించారు. 24 సంవత్సరాలుగా ఇలాంటి అనేక కుట్రలు, కుతంత్రాలు, కుట్రదారులను ఎదుర్కొన్న పార్టీ మాది. ఇవన్నీ దాటుకొని 24 ఏండ్ల పాటు నిబద్ధతతో, పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ సాధించిన పార్టీ బీఆర్ఎస్. సాధించుకున్న తెలంగాణ సగర్వంగా నిలబెట్టుకొని, అభివృద్ధిలో అగ్రపథాన నిలిపాము అని కేటీఆర్ తెలిపారు.

ఆత్మగౌరవం, అభివృద్ధిని పర్యాయపదాలుగా మార్చుకొని ఇతర రాష్ట్రాలకి ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాము. కోట్లాది గొంతుకలు, హృదయాలు తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ గుర్తింపు కోసం పోరాడుతున్నాయి కాబట్టే ఇది సాధ్యమైంది. ఎప్పటిలానే బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల కోసం నిలబడుతుంది.. పోరాడుతుంది. ఇప్పటికైనా అడ్డగోలు అసత్యాలను, దుష్ప్రచారాలను మానుకోవాలి. పడతాం, లేస్తం, తెలంగాణ కోసమే పోరాడుతాం కానీ తలవంచం.. ఎన్నటికైనా ఎప్పటికైనా అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# తమిళనాడు మాదిరి రూల్స్ ఫ్రేమ్ చేయండి




(మొదటిపేజి తరువాయి)

రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చదువుతున్నారు. ఈ నిబంధన ప్రకారం వాళ్లు పీజీ సీట్లకు నాన్ లోకల్ అయిపోరా? తమిళనాడులో మాదిరి రూల్స్ ఫ్రేమ్స్ చేయండి. అక్కడ ఎంబీబీఎస్ సీటు రావాలంటే ఆరు నుంచి పదివరకు స్థానికంగా చదువుకుని, తల్లిదండ్రులు స్థిర నివాసం కలిగి ఉండాలి. కర్నాటక, కేరళలకు వాటి నిబంధనలు ఉన్నాయి. తెలంగాణకు కూడా సొంత రూల్స్ కావాలి. చీఫ్ సెక్రటరీ, ఇతర ఉన్నతాధికారులతో ఒక కమిటీ వేసి విధానం రూపొందిస్తే అన్ని విద్యాసంస్థలకు మార్గదర్శకత్వం అవుతుందని హరీశ్‌రావు సూచించారు.

హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా పదేళ్ల పాటు ఉన్నందువల్ల పార్లమెంటు చట్టం ప్రకారం మేము పాత పద్ధతి కొనసాగించాం. పదేళ్ల కాలం ముగిసినా రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతినే కొనసాగించడం ఏమిటి..? రాష్ట్రపతి పాత ఉత్తర్వులోని మొదటి పారాగ్రాఫ్‌ను యథాతథంగా పెట్టారు. మిగతా పారాగ్రాఫ్‌లు వదిలి పెట్టారు. మా చేతుల్లో ఉన్నది కనుక అపుడు ఉద్యోగాల్లో 95 శాతం స్థానికులకే అనే నిబంధన తెచ్చాము. ఇపుడు అడ్మిషన్లలో 95 శాతం స్థానికులకే ఇచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఆ విషయంపై దృష్టి సారించడం లేదు. వెంటనే జీవో 33లో సవరణలు తేవాలి. ఈ అంశంపై అఖిలపక్షాన్ని పిలిస్తే సూచనలు ఇస్తాం. కాంగ్రెస్ పాలన గాలిలో దీపంలా ఉంది. వైద్య విద్య శాఖ అధికారులు ఏం చేస్తున్నారు? ప్రభుత్వం ఇప్పటికైనా కమిటీ వేయాలి. జీవోకు సవరణ చేయాలని కోరుతున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు

# భారత జట్టు ఘోర ఓటమి

- 110 పరుగుల తేడాతో శ్రీలంక విజయం
- 27 ఏళ్ల తర్వాత భారత్‌పై వన్డే సిరీస్ గెలిచిన శ్రీలంక



(మొదటిపేజి తరువాయి)

వన్‌డౌన్‌లో వచ్చిన కుసాల్ మెండిస్ (59) పరుగులు చేశాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 26.1 ఓవర్లలో కేవలం 138 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ రోహిత్ శర్మ (35), కోహ్లి (20), సుందర్ (30), పరాగ్ (15) మాత్రమే రెండంకెల స్కోరును అందుకున్నారు. లంక బౌలర్లలో దునిత్ వెల్లలాగె ఐదు, తీక్షణ, జెఫ్రి రెండేసి వికెట్లను పడగొట్టారు.

అనంతరం లక్ష్యచేధనకు దిగిన భారత్ 26.1 ఓవర్లలోనే 138 పరుగులకు కుప్పకూలింది. రోహిత్ శర్మ(20 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 35), వాషింగ్టన్ సుందర్(25 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 30) టాప్ స్కోరర్లుగా నిలిచారు. మిగతా బ్యాటర్లు విరాట్ కోహ్లీ(18 బంతుల్లో 4 ఫోర్లతో 20), శుభ్‌మన్ గిల్(6), రిషభ్ పంత్(6), శ్రేయస్ అయ్యర్(8), అక్షర్ పటేల్(2), రియాన్ పరాగ్(15), శివమ్ దూబే(9), కుల్దీప్ యాదవ్(6) దారుణంగా విఫలమయ్యారు.

శ్రీలంక బౌలర్లలో దునిత్ వెల్లలేగే(5/27) ఐదు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించగా.. మహీష్ తీక్షణ్, జెఫ్రీ వాండర్సే రెండేసి వికెట్లు తీసారు. అసితా ఫెర్నాండోకు ఓ వికెట్ దక్కింది. శ్రీలంక పర్యటనతోనే టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గంభీర్.. టీ20 సిరీస్ విజయంతో శుభారంభం అందు కున్నాడు. కానీ వన్డే సిరీస్‌లో అనూహ్య పరాజయాన్ని ఎదుర్కొ న్నాడు.

# పెట్టుబడుల పేరిట షెల్ కంపెనీలు..







- ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్
- కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణకు పెట్టుబడుల పేరుతో స్కాంగ్రెస్ పార్టీ ఎత్తుగడలు వేస్తూ ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఈ సంవత్సరం దావోస్‌లో 'గోడీ', ఇప్పుడు రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో సీఎం సోదరుడు నెల రోజుల క్రితం ప్రారంభించిన 'స్వచ్ఛ బయో కంపెనీ' ఇదే కోవలోనివి అని ఆరోపించారు. ఇది (కాంగ్రెస్ మోసం) ఆరంభం మాత్రమేనని... ఇలాంటివి మరోన్నో చూస్తామని పేర్కొన్నారు. షెల్ కంపెనీలను వెలుగులోకి తెచ్చావంటూ బీఆర్ఎస్ నేత క్రిశాంక్‌ను ప్రశంసించారు.

తెలంగాణలో పెట్టుబడులు పెడతానన్న స్వచ్ఛ బయోపై క్రిశాంక్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఎంవోయూలో సీఎం రేవంత్ రెడ్డితో ఉన్న వ్యక్తి హర్ష పసునూరి అని పేర్కొన్నారు. ఇతను అనుముల జగదీశ్వర్ బినామీ అని ఆరోపించారు.స్వచ్ఛ బయోను పదిహేను రోజుల క్రితం రేవంత్ రెడ్డి సోదరుడు ప్రారంభించినట్లు తెలిపారు. రూ.1000 కోట్ల పెట్టుబడుల ప్రకటన మోసమని... ఇదంతా కుటుంబ వ్యాపారమని ఆరోపించారు. హర్ష, జగదీశ్, సీఎం రేవంత్ రెడ్డికి సంబంధించిన చిత్రాలను క్రిశాంక్ ట్వీట్ చేశారు. దీనిని కేటీఆర్ రీట్వీట్ చేస్తూ కాంగ్రెస్ మోసం చేస్తోందని ఆరోపించారు.






## యాదాద్రి ఆలయ హుండీ లెక్కింపు

బలగం టీవి, హైదరాబాద్

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి నెల రోజుల హుండీ ఆదాయం రూ.2,66,68,787 వచ్చినట్లు ఆలయ ఇఒ భాస్కర్‌రావు తెలిపారు. బుధవారం యాదాద్రి కొండ కింద గల వ్రత మండపంలో నారసింహుడి హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది. నగదుతో పాటు 87 గ్రాముల బంగారం, 3 కిలోల 300 గ్రాముల వెండిని భక్తులు హుండీలో సమర్పించుకున్నట్లు ఆయన తెలిపారు.అమెరికా 1354 డాలర్లు, ఆస్ట్రేలియా 60 డాలర్లు, యూఏఈ 50 దిరమ్స్, నేపాల్ 20 రూపాయలు, సౌదీ అరేబియా 203 రియల్, సింగపూర్ 4 డాలర్లు, కువైట్ 3 దినార్, ఖతార్ 102 రియల్, ఒమన్ 400 బైస, శ్రీలంక 200 రూపాయలు, కెనడా 170 డాలర్లు, న్యూజిలాండ్ 50 డాలర్లు, యూరోప్ 80 యూరో, కెన్యా 50 శిలాంగ్స్, ఈజిప్ట్ 5 పాండ్స్, కజకిస్థాన్ 20 కజకిస్థాన్, స్కాట్లాండ్ 5 స్టెర్లింగ్, థాయిలాండ్ 40 భట్, కంబోడియా 10,00,000 రిఎల్‌ను భక్తులు హుండీలో సమర్పించుకున్నట్లు తెలిపారు.

# హెలికాప్టర్ కూలి ఐదుగురు మృతి

బలగం టీవి, హైదరాబాద్

నేపాల్ రాజధాని ఖాట్మండు వాయువ్య ప్రాంతంలో పర్వతాలలో ఒక హెలికాప్టర్ బుధవారం కూలిపోగా నలుగురు చైనా పర్యాటకులు, ఒక నేపాలీ పైలట్ మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రైవేట్ విమాన సంస్థ 'ఎయిర్ డైనాస్టీ'కి చెందిన హెలికాప్టర్‌లోని పైలట్‌తో సహా ఐదుగురూ ఖాట్మండుకు వాయువ్యంగా సుమారు 30 కిలో మీటర్ల దూరంలోని నువకోట్ జిల్లాలో శివపురి నేషనల్ పార్క్‌లో పతనమైందని పోలీస్ అధికారి ఒకరు తెలియజేశారు. హెలికాప్టర్ బుధవారం మధ్యాహ్నం 1.54 గంటలకు త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరిందని, టేకాఫ్ తరువాత మూడు నిమిషాలకే కంట్రోల్ టవర్‌తో సంబంధం కోల్పోయిందని నేపాల్ పౌర విమానయాన ప్రాధికార సంస్థ ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. ఈ దుర్ఘటనపై దర్యాప్తునకు ముగ్గురు సభ్యుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

## తెలంగాణ సహా 12 రాజ్యసభ స్థానాలకు ఉపఎన్నికల ప్రకటన జారీ

బలగం టీవి, న్యూఢిల్లీ

రాజ్యసభ ఉప ఎన్నికలకు ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. ఖాళీగా ఉన్న 12 రాజ్యసభ స్థానాలకు సిఈసి ప్రకటన జారీ చేసింది. తెలంగాణ నుంచి రాజ్యసభ ఎంపీ కేశవరావు రాజీనామా చేయడంతో ఖాళీ అయిన స్థానికి కూడా ఎన్నికలు జరుగనున్నాయి.సెప్టెంబర్ 3వ తేదీన ఉప ఎన్నికల పోలింగ్, అదే రోజు సాయంత్రం ఐదు గంటల నుంచి లెక్కింపు. ఇక నామినేషన్ల ఉపసంహరణ ఆగస్టు 26,27న ఉండనున్నాయి. కెకె కాంగ్రెస్ పార్టీలో చేరినందున ఆయన ఖాళీ చేసిన సీటు కూడా కాంగ్రెస్ కే వచ్చేలా ఉంది. కాగా 12 రాజ్యసభ స్థానాల్లో 11 స్థానాలు ఎన్డీయే కూటమే దక్కించుకోనుందని తెలుస్తోంది.

# డాక్టర్ల నియామకానికి నోటిఫికేషన్



బలగం టీవి, హైదరాబాద్

ఉస్మానియా, గాంధీ ఆసుపత్రిలలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను కాంట్రాక్ట్ ప్రాతిపదిక నియమించుకునేందుకు నోటిఫికేషన్ విడులైంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో వివిధ స్థాయిలలో 235 మంది వైద్యులను నియమించుకోనున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రొఫెసర్ల నియామకాల కోసం నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఈ నియామకాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఈ నియామకాలు పారదర్శకంగా జరిగేలా హైదరాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌లు నోడల్ అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

ఉస్మానియా ఆసుపత్రిలో మొత్తం 175 పోస్టులు భర్తీ చేయనుండగా, అందులో 8 ప్రొఫెసర్ పోస్టులు, 23 అసోసియేట్ ప్రొఫెసర్, 111 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 33 సీనియర్ రెసిడెంట్ డాక్టర్ పోస్టులు ఉన్నాయి. అలాగే గాంధీ ఆసుపత్రిలో మొత్తం 60 పోస్టులు ఉండగా, 3 ప్రొఫెసర్ పోస్టులు, 29 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 29 సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు, 4 ట్యూటర్ పోస్టులు ఉన్నాయి. ఉస్మానియా ఆసుపత్రి, గాంధీ ఆస్పత్రులలో మొత్తం. 235 పోస్టులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. వాకింగ్ ఇన్ ఇంటర్వ్యూ విధానంలో నియమించే ఈ నియామకాలకు ఈ నెల 9వ తేదీన ఉదయం 10.30 గంటలకు గాంధీ మెడికల్ కాలేజి పరిపాలన భవనంలో డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అదేవిధంగా అదేరోజు ఉదయం 10.30 గంటలకు ఉస్మానియా మెడికల్ కాలేజ్ అకడమిక్ బ్లాక్‌లో తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ సమక్షంలో ఇంటర్వ్యూలు జరుగుతాయి. ఈ నెల 12న ధృవపత్రాల పరిశీలన నిర్వహించి, ఈ నెల 13న అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈ నెల 14న ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు.

# ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం



బలగం టీవి, హైదరాబాద్

రియల్ ఎస్టేట్‌పై ఇటీవలే ప్రవేశపెట్టిన నూతన మూలధన లాభాల పన్నును ప్రభుత్వం సడలించిన తరువాత ఆర్థిక బిల్లు 2024ను లోక్‌సభ బుధవారం ఆమోదించింది. ఈ సడలింపు వల్ల పన్ను చెల్లింపుదారులు కొత్త తక్కువ పన్ను రేటుకు మారడానికి లేదా ఇండెక్సేషన్ ప్రయోజనంతో అధిక రేటు గల పాత పన్ను విధానంతో కొనసాగడానికి అవకాశం ఉంటుంది. ఇండెక్సేషన్ ప్రయోజనం లేకుండానే రియల్ ఎస్టేట్‌పై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టిసిజి)ని 20 శాతం నుంచి 12 శాతానికి తగ్గించేందుకు తన 2024–25 బడ్జెట్‌లో ప్రతిపాదించిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆప్షన్ ఇచ్చేందుకు బిల్లుకు సవరణ ప్రవేశపెట్టారు. ద్రవ్యోల్బణానికి సర్దుబాటు చేసుకున్న తరువాత ఆస్తి ధరకు రావడానికి పన్ను చెల్లింపుదారులకు ఇండెక్సేషన్ ప్రయోజనం వీలు కల్పిస్తుంది. పన్ను విధింపును పెంచినందుకు, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులకు ప్రోత్సాహకాలు లేనందుకు కొత్త నిబంధన విమర్శలకు గురైన తరువాత ఈ సవరణ చోటు చేసుకుంది.

బిల్లులో తీసుకువచ్చిన ప్రధాన సవరణ జూలై 23కు ముందు కొన్న ఆస్తుల విక్రయంపై ఇండెక్సేషన్ ప్రయోజనం పునరుద్ధరణకు సంబంధించినది. ఇప్పుడు జూలై 23కు ముందు ఇళ్లు కొనుగోలు చేసిన వ్యక్తులు లేదాహెచ్‌యుఎఫ్‌లు ఇండెక్సేషన్ లేకుండా 12.5 శాతం రేటుకు కొత్త పన్ను కింద ఎల్‌టిసిజి పన్ను చెల్లింపును ఎంచుకోవచ్చు లేదా ఇండెక్సేషన్ ప్రయోజనం పొందుతూ 20 శాతం పన్ను చెల్లించవచ్చు. దిగువ సభ మూజువాణి వోటుతో 45 అధికారిక సవరణలతో బిల్లును ఆమోదించింది. 2024 ఆర్థిక బిల్లు ఇప్పుడు చర్చ కోసం రాజ్యసభకు వెళుతుంది. అయితే, రాజ్యాంగం ప్రకారం మనీ బిల్లును తిరస్కరించే అధికారం ఎగువ సభకు ఉండదు. అది అటువంటి బిల్లులను తిప్పిపంపడం మాత్రమే చేయగలదు. ఒకవేళ రాజ్యసభ నిర్దేశిత 14 రోజులలోగా అలా చేయనట్లయితే, బిల్లుకు ఆమోదముద్ర లభించినట్లుగా పరిగణిస్తారు. 2025 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనల లక్ష్యం పెట్టుబడులను ప్రోత్సహించడం, మధ్య తరగతికి లబ్ధి చేకూర్చడం అని కూడా సీతారామన్ చెప్పారు.

లిస్ట్ అయిన ఈక్విటీలు, బాండ్లలో దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను మినహాయింపు పరిమితిని రూ. 1 లక్ష నుంచి రూ. 1.25 లక్షలకు పెంచడం స్టాక్ మార్కెట్లలో మదుపు చేసే మధ్య తరగతికి లబ్ధి చేకూరుస్తుందని ఆమె తెలిపారు. మోడీ ప్రభుత్వం పన్నులను మరీ ఎక్కువగా పెంచకుండా సరళీకృత పన్ను వ్యవస్థను తీసుకువచ్చిందని, పన్ను పాటింపును తేలిక చేసిందని ఆమె చెప్పారు. వివిధ సరకులపై కస్టమ్స్ సుంకం తగ్గింపు వాణిజ్యాన్ని, పెట్టుబడులను ప్రోత్సహిస్తుందని, ఉపాధి కల్పనకు దోహదం చేస్తుందని సీతారామన్ తెలిపారు. ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై జిఎస్‌టిని తొలగించాలన్న డిమాండ్లకు సీతారామన్ స్పందిస్తూ, వసూలైన జిఎస్‌టిలో 75 శాతం రాష్ట్రాలకు వెళుతుందని తెలియజేశారు. ఆరోగ్య బీమా (ప్రీమియం)పై 18 శాతం జిఎస్‌టి విధింపునకు ముందు అన్ని రాష్ట్రాలు బీమా ప్రీమియంలపై పన్ను విధిస్తుండేవని, జిఎస్‌టిని ప్రవేశపెట్టిన తరువాత ఆ పన్ను ఆటోమేటిక్‌గా జిఎస్‌టిలో కలిసిపోయిందని సీతారామన్ చెప్పారు.

# ఫ్రాడ్ పనులు సీఎం రేవంత్ మానుకోవాలి

(మొదటిపేజి తరువాయి)

బృందంతో అమెరికా వెళ్లారు. గతంలో కేటీఆర్ అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు ఐటీ శాఖకు సంబంధించిన సెక్రటరీలు వెళ్లారు. కానీ ఇవాళ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఫైనాన్స్, ఇండస్ట్రీస్, ఐటీ సెక్రటరీలు కూడా అక్కడే ఉన్నారు. ఎమ్మెల్యేలతో పాటు ఆఖరికి మీ జిల్లా డీసీసీ అధ్యక్షులు కూడా కనబడుతున్నరు. ఓటుకు నోటు కేసులో మీతో పాటు ఉన్న ముద్దాయిలు కూడా కనబడుతున్నరు. 30 మందితో అధికార బృందం వెళ్లింది మీ తమ్ముళ్ల వ్యాపారం కోసమా..? తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి ఇక్కడి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తావనుకుంటే.. మీ సోదరుల కోసం అమెరికాకు పోయి 15 రోజుల క్రితం ఏర్పాటైన స్వచ్ఛ్ బయో కంపెనీ వెయ్యి కోట్ల పెట్టుబడి పెడుతుందని ప్రకటించి, రాష్ట్ర ప్రజలను మభ్య పెడుతున్నారని మన్నె క్రిశాంక్ ధ్వజమెత్తారు.



## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో తీర్పు వాయిదా

(మొదటిపేజి తరువాయి)

సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. దీనికి అనుగుణంగా స్పీకర్‌కు హైకోర్టు నిర్ధిష్ట గడువు విధించాలని కోరారు.

## బిత్తిరి సత్తిపై సీసీఎస్‌లో కేసు నమోదు

బలగం టీవి, హైదరాబాద్

ప్రముఖ నటుడు బిత్తిరి సత్తి అలియాస్ రవిపై హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. బిత్తిరి సత్తి ఇటీవల యూట్యూబ్‌లో రిలీజ్ చేసిన వీడియోలో భగవద్గీతను కించపర్చేలా వీడియో చేశాడని.... దీనిపై వానర సేన ఆగ్రహం వ్యకం చేసింది. రాష్ట్రీయ వానర సేన జాతీయ అధ్యక్షుడు నామ్ రామ్‌రెడ్డి... భగవద్గీతను కించపర్చేలా వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న బిత్తిరి సత్తిపై సీఈసఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వీడియోలు చేసి వైరల్ చేస్తున్న రవికుమార్ అలియాస్ బిత్తిరి సత్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు తీసుకున్న సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వెంటనే బిత్తిరి సత్తికి ఫోన్ చేసి తమ ఎదుట హాజరు కావాలని ఆదేశించారు. రెండు రోజుల్లో బిత్తిరి సత్తి సిసిఎస్ పోలీసుల ఎదుట హాజరుకానున్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# బంగ్లాదేశ్‌లో అవే పరిస్థితులు

బలగం టీవి, హైదరాబాద్

బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వం పతనమైన తరువాత గత మూడు రోజులుగా తీవ్ర గందరగోళం కొనసాగుతోంది. శాంతిభద్రతలను అదుపు చేయడం , ట్రాఫిక్‌ను నియంత్రించడం లో పోలీస్‌లు తమ విధులకు గైర్హాజరు కావడంతో పరిస్థితిని యథాప్రకారం అదుపు లోకి తీసుకురాడానికి అధికారులు నానా తంటాలు పడుతున్నారు. రెండోరోజు బుధవారం విద్యార్థులు, స్కౌట్ సభ్యులు ట్రాఫిక్ నిర్వహణ విధుల్లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. పోలీస్ ఉన్నతాధికారిగా మంగళవారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆర్ఎబిగా నియామకమైన అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఎఐజి) ఎకెఎం షహిదుర్ రెహ్మాన్ పోలీస్‌లు తమ విధులకు హాజరు కావాలని, ప్రజల భద్రత, శాంతిభద్రతలు పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు పోలీస్‌లు స్నేహితులని, ప్రజల కోసమే పనిచేస్తారని, పోలీస్‌లు లేకుండా సమాజాన్ని ఊహించలేమని, అందువల్ల వదంతులను విడిచిపెట్టి విధులకు తిరిగి దశల వారీగా హాజరు కావాలని రెహ్మాన్ విజ్ఞప్తి చేశారు.

రాపిడ్ యాక్షన్ బెటాలియన్ (ఆర్ఎబి), ఢాకా మెట్రోపాలిటన్ పోలీస్ (డిఎంపి) ఉన్నత స్థానాల్లో బుధవారం తిరిగి నియామకాలు జరిగాయి. నోబెల్ బహుమతి గ్రహీత మొహమ్మద్ యూనస్‌ను ఆపద్ధర్మ ప్రభుత్వఅధినేతగా అధ్యక్షుడు మొహమ్మద్ షాహబుద్దీన్ నియమించిన తరువాత ఈ నియామకాలు జరిగాయి. 2020 అక్టోబర్‌లో నియామకమైన అటార్నీ జనరల్ అడ్వకేట్ అబు మొహమ్మద్ అమిన్ ఉద్దీన్ బుధవారం రాజీనామా చేశారు. ఇదిలా ఉండగా పారిశ్రామిక, వాణిజ్య వర్గాలు శాంతిభద్రతలను అదుపు చేయాలని పాలక వర్గాన్ని అభ్యర్థించారు. గత రెండు రోజులుగా ఫ్యాక్టరీలను దగ్ధం చేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో తమ ఉత్పత్తులకు భద్రత కల్పించే చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం గార్మెంట్ యూనిట్లను తెరిచినప్పటికీ చాలా మంది భయాందోళనలతో తమ యూనిట్లను నడపలేక పోయారు. బంగ్లాదేశ్ బ్యాంకులో ఆందోళనకర పరిస్థితి నెలకొనడంతో డిప్యూటీ గవర్నర్ కాజీ సయేదుర్ రెహ్మాన్‌తోపాటు బంగ్లాదేశ్ బ్యాంకుకు చెందిన ఆరుగురు ఉన్నతాధికారులు రాజీనామా చేశారు.

బంగ్లాదేశ్ బ్యాంకుకు చెందిన వందమంది అధికారులు బ్యాంకు గవర్నర్ ఆఫీస్‌ను స్తంభింప చేశారని, అనేక మంది డిప్యూటీ గవర్నర్లను ఆఫీస్‌ను విడిచిపెట్టేలా చేశారని ఢాకా ట్రిబ్యూన్ పేర్కొంది. వీరిలో ఇద్దరు బ్యాంకు లూటీదారులకు సహాయం చేశారని ఆందోళన కారులు ఆరోపించారని తెలియజేసింది. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటా విధానంపై జులైలో మొదట ఆందోళన ప్రారంభమైన దగ్గర నుంచి ఇప్పటివరకు 469 మంది మృతి చెందగా, మంగళవారం హసీనా కు చెందిన అవామీ లీగ్ పార్టీ మద్దతుదారులైన 29 మంది మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మైనార్టీలపై మంగళవారం హింసాత్మక దాడులు భారీగా జరిగాయని మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రఖ్యాత గాయకుడు రాహుల్ ఆనంద్ గృహాన్ని ఆందోళన కారులు తగుల బెట్టారు. ఆయన సంగీత వాయిద్యాలు 3000 వరకు దగ్ధం చేశారు.





# రోడ్డు పనులు పరిశీలించిన కలెక్టర్


**బలగం టీవీ , సిరిసిల్ల :**

వీర్నపల్లిలో సమస్యలను స్థానికులు ఇటీవల విన్నవించగా,స్థానికుల సమాచారం మేరకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం వీర్నపల్లి మండల కేంద్రంలో పర్యటించారు.ఈ సందర్భంగా రోడ్డు పనులను కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పలువురు యువకులు లైబ్రరీ కి పుస్తకాలు కావాలని కోరగా, అందజేస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ సమీపంలోని బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ పర్యటన లో ఇంచార్జీ తహసీల్దార్ మారుతిరెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కువైట్‌లో నన్ను కొడుతున్నారు... కాపాడండి

- **సీఎం రేవంత్ రెడ్డికి నిర్మల్ వాసి విజ్ఞప్తి**

**బలగం టీవీ , నిర్మల్**



కువైట్‌లో తనను కొడుతున్నారని, తీవ్ర అవస్థలు పడుతున్నానని... తనను స్వదేశానికి తీసుకువెళ్లండని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నాందేవ్ మొరపెట్టుకున్నాడు. ఈ మేరకు ఓ వీడియో చిత్రీకరించి పోస్ట్ చేశాడు. తనను స్వదేశానికి తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరాడు.ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్ పది నెలల క్రితం కువైట్ వెళ్లాడు. ఇంట్లో పని అని చెప్పి ఓ ఏజెంట్ తనను కువైట్ పంపించినట్లు చెప్పాడు. కానీ కువైట్ చేరుకున్నాక తనను మోసం చేసినట్లు తెలిసిందని పేర్కొన్నాడు. ప్రస్తుతం ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేస్తున్నానని, తనను కొడుతున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తనను ఇక్కడి నుంచి తీసుకువెళ్లేలా చూడాలని కోరాడు.

## ‘స్వచ్ఛదనం -పచ్చదనం’లో

# ప్రత్యేక అధికారులు కీలకపాత్ర పోషించాలి..

- **సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు సమన్వయంతో పని చేయాలి..**
- **పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా స్వచ్ఛదనం - పచ్చదనం నిర్వహణ..**
- **రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రత్యేక అధికారి శృతి ఓఝా..**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో ప్రత్యేక అధికారులు కీలకపాత్ర పోషించాలని, కిందిస్థాయి సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు ఎప్పటికప్పుడు అందిస్తూ వారిని సరైన మార్గంలో గైడ్ చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రత్యేక అధికారి శృతి ఓఝా అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమ పర్యవేక్షణకు ప్రభుత్వం ఇంటర్మీడియట్ బోర్డు సంచాలకులు శృతి ఓఝాను రాజన్న సిరిసిల్ల , జగిత్యాల జిల్లాలకు ప్రత్యేక అధికారిగా నియమించగా బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమ అమలు పై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

జిల్లాలో ఉన్న 255 గ్రామ పంచాయతీలు, వేములవాడ, సిరిసిల్ల మున్సిపాలిటీలలో ఆగస్టు 5 , 6 తేదిలలో స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం లో భాగంగా నిర్వహించిన కార్యక్రమాల వివరాలు , గుర్తించిన సమస్యలు వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు, ప్రత్యేక అధికారుల అనుభవాలను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమ అమలు తీరు, జిల్లాలో తీసుకున్న చర్యలు, రూపొందించుకున్న ప్రణాళికలు పలు అంశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వివరించారు.

ఈ సందర్భంగా సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి అధికారి శృతి ఓఝా మాట్లాడుతూ నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛదనం – పచ్చదనం ప్రోగ్రాం ను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా అమలు చేయాలని అన్నారు. సమర్థవంతంగా పారిశుధ్య నిర్వహణ ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని, గ్రీనరీ పెంచడం ద్వారా కాలుష్యం తగ్గుతుందని, పర్యావరణ సంరక్షణ సాధ్యమవుతుందని, ఈ లక్ష్యాలతో ప్రభుత్వం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య శాఖ పంచాయతీరాజ్ శాఖ మున్సిపల్ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రోడ్ల గుంతలు పూడ్చే ప్రక్రియను ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలని, మన గ్రామాలు పట్టణాలను పరిశుభ్రత, పచ్చదనం పెంపొందేలా తీర్చిదిద్దాలని, ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేస్తూ స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని విజయ వంతంగా అమలు చేయాలని అన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం త్రాగు నీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, మురికి కాల్వలను, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయడం, రోడ్ల పై ఉన్న గుంతలను పూడ్చడం, సీజనల్ వ్యాధుల నియంత్రణ పై అవగాహన, వీధి కుక్కల దాడుల నివారణ చర్యలు, డ్రై డే, ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో వేములవాడ సిరిసిల్ల ఆర్డీవోలు రాజేశ్వర్, రమేష్ లు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి , మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది..





- **త్వరలోనే సిరిసిల్లలో మంత్రుల బృందం పర్యటన..**
- **ప్రభుత్వం తరపున నేత కార్మికులకు ఆర్డర్ ఇస్తాం..**
- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్.**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

నేతన్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉండగా ఉంటుందని, వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు.బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్ స్టాండ్ వద్ద ఉన్న నేతన్న విగ్రహానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ పూల మాలలు వేశారు.అనంతరం సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్లోని షాది ఖానాలో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ విప్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాలు ధరించి నేత కార్మికులను ఆదుకోవాలని ప్రతిజ్ఞ చేశారు,

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేసి,త్రిఫ్ట్ పథకం కింద మంజూరైన 2 కోట్ల 64 లక్షలు 62 వేయిలా రూపాయలు చెక్కును కార్మికులకు అందజేసి, నేత కార్మికులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత, మర మగ్గాల రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలని కృత నిశ్చయంతో ఉంది అని,చేనేత కార్మికుడు మర మగ్గం కార్మికుడు గా మారి ఉపాధి పొందుతున్నారని అన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చేనేత రంగం సంక్షోభం ఉన్నపుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సిరిసిల్ల లో పర్యటించి, వారికోసం సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నికల కోడ్ రావడంతో పాలన పై దృష్టి పెట్టలేక పోయామని, మూడు నెలల నుండి పాలనపై దృష్టి దృష్టి సారించి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు.నేత కార్మికులు ఎవరు అధైర్యపడవద్దని, ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని, ప్రభుత్వం తరపున నేత కార్మికులకు తప్పకుండా ఆర్డర్లు ఇస్తామని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని నేత కార్మికులు దీక్షలు చేసినప్పుడు, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేత కార్మికులు కీ నైపుణ్యం పెంపొందించే విధంగా,ప్రభుత్వం అ దిశగా అడుగులు వేస్తుందని, అదేవిధంగా చేనేత రంగం లో బిటెక్ చదివిన విద్యార్థులకు ఉపాధి కల్పిస్తామని,అపరల్ పార్కు లో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని అన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకున్న సమస్యలను పరిష్కరించడానికి త్వరలోనే మంత్రుల బృందం సిరిసిల్లలో పర్యటిస్తుందని అన్నారు. టెక్స్టైల్ కు సంబంధించి 4 కోట్ల 52 లక్షల బకాయిలను ప్రభుత్వం విడుదల చేసిందని, మిగిలిన బకాయిలను త్వరలోనే విడుదల చేస్తామని అన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త టెక్నాలజీ, ఆలోచనలో పోటీ ప్రపంచలో సిరిసిల్ల పరిశ్రమ నిలదుక్కుకునే విధముగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ వచ్చే చేనేత దినోత్సవం వరకు కొత్త పుంతలతో నిలదొక్కుకోవాలనీ అన్నారు.ఈ కార్యక్రమం లో కార్యక్రమంలో సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కే కే మహేందర్ రెడ్డి, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్ శాఖ ఏడీ సాగర్, పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్ బాధితునికి అండగా నిలిచిన ఆది శ్రీనివాస్

- **త్వరలోనే స్వదేశానికి గల్ఫ్ బాధితుడు ఇమ్రాన్.**



**బలగం టీవీ , సిరిసిల్ల :**

గల్ఫ్ బాధితునికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అండగా నిలిచారు. సౌదీ అరేబియాలో అనారోగ్యంతో బాధపడుతు, దుర్భర జీవితాన్ని గడుపుతున్న ఓ యువకునికి, స్వస్థలం తీసుకువచ్చే బాధ్యత తనదేననీ అంటూ భరోసా ఇచ్చారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన ఇమ్రాన్ ఉపాధి నిమిత్తం నెలన్నర రోజుల క్రితం సౌదీ అరేబియా వెళ్లి, అక్కడ సూపర్ మార్కెట్లో పనిచేస్తున్నాడు. గత 15 రోజుల క్రితం ఆరోగ్యం బాగాలేక సౌదీ అరేబియాలోనే ఫైల్స్ ఆపరేషన్ చేయించుకోగా, అయినా ఆరోగ్యం బాలేక కాకపోవడంతో ఇండియా పంపాలని యాజమాన్యాన్ని కోరగా, వారు ఇండియాకు పంపక పోగా కొడుతున్నారని, చంపేస్తామని బెదిరిస్తున్నారని తన దుర్భర పరిస్థితిని వివరిస్తూ, తనను ఇండియా తీసుకురావాలని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి లను సోషల్ మీడియా వేదికగా వేడుకున్నాడు. సోషల్ మీడియాలో ఇమ్రాన్ వీడియో వైరల్ కావడంతో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి రావడంతో తక్షణమే స్పందించిన ప్రభుత్వ విప్ ఇమ్రాన్ ను తిరిగి స్వదేశానికి రప్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇండియన్ ఎంబసీ, సౌదీ అరేబియా దేశానికి లేఖ రాశారు. ఇమ్రాన్ స్వదేశానికి వచ్చేందుకు విమాన టికెట్లు, ఖర్చులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పూర్తిగా భరిస్తానని హామీ ఇచ్చారు.బుధవారం సౌదీ అరేబియా లోనే ఉంటున్న ఎన్నారై బైరా దేవ్ యాదవ్ ఇమ్రాన్ దగ్గరికి వెళ్లి కలువగా, ప్రస్తుతం ఇమ్రాన్ ఎన్నారై బైరి యాదవ్ దగ్గర సురక్షితంగా ఉన్నానని రెండు మూడు రోజుల్లో తాను ఇండియాకు వస్తానని, ఇబ్బందుల్లో ఉన్నానని విడియో చూసి తక్షణమే స్పందించి, ఇండియా రావడానికి అందుకు అయ్యే ఖర్చులను మొత్తం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భరిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఒక వీడియో విడుదల చేశారు.

# మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు..

- **మహిళల భద్రతయే.. మా మొదటి ప్రాధాన్యత...**
- **ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**



మహిళలను,యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని, బాలికల పై ఎవరైనా అఘాయిత్యాలు చేస్తే ,పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్ లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో విద్యార్థులకు మహిళ రక్షణ, షీ టీమ్స్,ఈవ్ టీజింగ్ ,పోక్సో ,సైబర్ క్రైమ్స్, ఇతర అంశాలపై ఎస్పీ అఖిల్ మహాజన్ అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ మహిళల,విద్యార్థినిల భద్రతకు సంబంధించి ఏ సమస్య ఉన్న నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని,మహిళ భద్రతయే పోలీస్ శాఖ మొదటి ప్రాధాన్యత అని,విద్యార్థిని విద్యార్థులు సోషల్ మీడియాకి దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మహిళలు మరియు చిన్న పిల్లల రక్షణ విషయంలో పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని, మహిళల భద్రత, ఆకతాయిల వేధింపుల నుండి మహిళల రక్షణ కొరకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తూ జిల్లా వ్యాప్తంగా షిటీమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థినీలు,మహిళలకు అవగాహన కల్పిస్తూ నిరంతరం వారికి అందుబాటులో ఉంటున్నదన్నారు.

మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా పోలీస్ వారిని సంప్రదించాలని, నేరుగా సంప్రదిం చలేని వారు షీ టీమ్ నంబర్ 87126 56425, లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వగలరని, సమాచారం అందించిన వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచడతాయని అన్నారు. విద్యార్థిని విద్యార్థుల సోషల్ మీడియా(ఫేసుబుక్, ఇంస్టాగ్రామ్)కు దూరంగా ఉండాలని,ప్రస్తుతం మహిళలపై వేధింపులు అఘాయిత్యాలు,సోషల్ మీడియా వేధింపులు ఆన్లైన్ వేధింపులు సైబర్ క్రైమ్స్, ఆన్లైన్ ఫ్రాడ్స్ ఎక్కువగా జరుగు తున్నాయని ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని అన్నారు.

విద్యార్థి దశనుండే ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని క్రమశిక్షణ పట్టుదల ఓపికతో కష్టపడినప్పుడు మంచి విజయాలు సాధిస్తారన్నారు.చదువుకునే యుక్త వయస్సు లో యువతులు ప్రలోభాలు,ఆకర్షణలకు గురై భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని అన్నారు.జీవితంలో ప్రతి స్టేజ్ ముఖ్యమే అని ఈరోజు మీరందరూ ఇక్కడ సంతోషంగా ఉన్నారు అంటే మీ తల్లిదండ్రులు ఏదో రకంగా కష్టపడి పని చేసి, మిమ్మల్ని ఇక్కడికి పంపించడం జరిగిందని

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి





- **మురికి నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి**
- **స్వచ్ఛదనం.. పచ్చదనం జిల్లా ప్రత్యేక అధికారి శృతి ఓఝా**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ప్రజలు పరిసరాలనుపరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురికి నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని స్వచ్ఛదనం,పచ్చదనం జిల్లా ప్రత్యేక అధికారి, ఇంటర్మీడియెట్ బోర్డు డైరెక్టర్ శృతి ఓఝా అన్నారు బుధవారం స్వచ్ఛదనం.. పచ్చదనంలో భాగంగా మూడో రోజు కార్యక్రమానికి స్వచ్ఛదనం.. పచ్చదనం జిల్లా ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి బుధవారం తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల, నేరెళ్లలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లెలలో మొక్కలు నాటారు. సెగ్రిగేషన్ షెడ్ ను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి, స్థానికులతో స్వచ్ఛదనం.. పచ్చదనం జిల్లా ప్రత్యేక అధికారి శృతి ఓఝా మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురికి కాలువల్లో పూడిక తీయించాలని, లోతట్టు ప్రాంతాలు, నీటి నిల్వగల ప్రదేశములను గుర్తించి, మొరం నింపాలని, నిల్వ నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని, మురికి కాలువల చివర, నీటి పారుదల సౌకర్యం లేని, నీటి నిల్వ గల ప్రదేశాలలో కమ్యూనిటి సోక్ పిట్స్ లేదా ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆదేశించారు. ఇక్కడ. సిరిసిల్ల ఆర్డీఓ రమేష్ , డీఆర్డీఓ శేషాద్రి , ఎం.పి.డి. ఓ . లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్నను దర్శించుకున్న శృతి ఓఝా

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని స్వచదనం.. పచ్చదనం జిల్లా ప్రత్యేక అధికారి, డైరెక్టర్ ఇంటర్మీడియట్ బోర్డు శృతి ఓఝా, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వచదనం.. పచ్చదనం జిల్లా ప్రత్యేక అధికారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కల్యాణ మండపంలో ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ శ్రుతి ఓఝా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి బుధవారం పరిశీలించారు. ఉచితంగా పంపిణీ చేసిన అన్ని పుస్తకాలు వచ్చాయా? అని ఆరా తీశారు. ఇప్పటి వరకు ఎక్కడి దాకా సిలబస్ పూర్తి అయిందని అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో కావాల్సిన వసతుల పై ప్రిన్సిపాల్ శరత్ కుమార్ శర్మను ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, ఈఈ రాజేష్, ఆలయ పర్యవేక్షకులు హరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి



**ఎస్ఐ సుధాకర్**

**బలగం టీవీ, తంగళ్ళపల్లి**

సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని “సైబర్ జాగ్రూక్త దివాస్” లో భాగంగా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచన మేరకు తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని ఎస్సై డి సుధాకర్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆన్లైన్, మల్టీ లెవెల్ మార్కెటింగ్ పేరుతో మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అంటూ మొసపూరిత ప్రచారల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈజీ మనీ ఆశలో పడి మోసపోవద్దన్నారు.ఆన్లైన్ ట్రేడింగ్,గొలుసుకట్టు వ్యాపారాలతో అమాయక ప్రజలకు కుచ్చుటోపి పెడుతున్నారని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మార్కెటింగ్ సెమినార్లు పెట్టి మధ్యతరగతి ప్రజలను టార్గెట్ చేస్తూన్నారని సైబర్ నెరగాళ్లు కొన్ని వాట్సఅప్ గ్రూప్ లు క్రియేట్ చేసి డబ్బు లు గెలుచుకున్నట్టు మెసేజ్ లు పెడుతున్నారని వాటి పట్ల నమ్మి అత్యాశకు పోకుండా ఉండాలని అన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 తో పాటు డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ సైబర్ క్రైమ్.గౌవ్.ఇన్ వెబ్ సైట్ లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు

- 50 కేజీల కంటే 100 గ్రాములు ఎక్కువుందని వేటు
- భారత్ అభిమానులను షాక్‌కు గురిచైసిన నిర్ణయం
- వినేశ్‌కు అస్వస్థత అంటూ వార్తలు





**బలగం టీవీ, పారిస్**

పారిస్ ఒలింపిక్స్‌లో మరో పతకం ఖాయం అనుకుంటున్న సమయంలో ఊహించని సంఘటన చోటు చేసుకుంది. భారత మహిళ స్టార్ రెజ్లర్‌ను ఒలింపిక్స్ ఫైనల్ నుంచి డిస్క్వాలిఫై చేశారు. అధిక బరువు కారణంగా అనర్హత వేటు వేయడంతో పతకం ఆశలు గల్లంతయ్యాయి. నిబంధనల ప్రకారం ఉండాల్సిన 50 కేజీల బరువు కంటే ఆమె 100 గ్రాములు ఎక్కువగా ఉండటంతో ఆమెపై అనర్హత వేటు పడింది. మహిళల 50 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో ఫైనల్‌కు చేరిన ఫొగాట్ భారత్‌కు పతకం ఖాయం చేసింది. ఫైనల్లో గెలిచినా ఓడినా భారత్‌కు పతకం వచ్చేది. అనర్హత కారణంగా ఆమె పతకం గెలిచే అవకాశం కోల్పోయింది. ఇండియన్ ఒలింపిక్ అసోషియేషన్ వినేశ్‌పై అనర్హత ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఇంతకుమించి ఐఓఏ మరేమీ చెప్పలేదు. అయితే వినేశ్ ప్రతిభకు గౌరవం ఇవ్వాలని, చేతిలో మిగిలి ఉన్న మిగతా గేమ్‌లపై తాము దృష్టి సారిస్తున్నామని ఐఓఏ తెలిపింది.

వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం ఫైనల్ మ్యాచ్‌లో బుధవారం అమెరికా రెజ్లర్ సారా హెండెబ్రాండ్‌తో వినేష్ తలపడాల్సి ఉంది. అయితే.. మంగళవారం రాత్రికి ఆమె నిర్ణీత బరువు కన్నా రెండు కిలోలు అదనపు బరువు కలిగి ఉంది. దీంతో ఆమె బరువు తగ్గడం కోసం జాగింగ్, సైక్లింగ్, స్కిప్పింగ్ వంటివి చేసింది. భోజనం చేయక పోగా.. రాత్రి అంతా మేల్కొని బరువును తగ్గించుకునే పనిలో ఉన్నట్టు తెలిసింది. ఈ క్రమంలో ఆమె డీహైడ్రేషన్‌కు గురైనట్లు వార్తలు వస్తున్నాయి. ఆమెకు ఒలింపిక్స్ గ్రామంలోని పాలిక్లినిక్‌లో ట్రీట్‌మెంట్ జరుగు తున్నట్లు ఆ వార్తల సారాంశం. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు సదరు కథనాలు పేర్కొన్నాయి.

బరువు తగ్గించుకునేందుకు చేయాల్సిన అన్ని ప్రయత్నాలు చేసినప్పటికి వెయిట్ పరీక్షల సమయానికి 100 గ్రాముల అదనపు బరువును ఆమె కలిగి ఉంది. ఆమెకు ఇంకొంత సమయం ఇవ్వాలని భారత అధికారుల అభ్యర్థనను ఒలింపిక్స్ అధికారులు తిరస్కరించారు. అంతేకాకుండా ఆమె పై అనర్హత వేటు వేశారు. దీంతో ఫైనల్ కు చేరుకున్నప్పటికి వినేశ్ ఫోగట్ ఎలాంటి పతకం లేకుండా భారత్‌కు తిరిగి రావాల్సి ఉంటుంది.

**ఐఓఏ పకటన**

**"మహిళల రెజ్లింగ్ 50 కేజీల విభాగం నుంచి వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు వేశారని వెల్లడించడానికి మేం చింతిస్తున్నాం. టీమ్ రాంత్రంతా ఎన్ని రకాలుగా ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. ఉదయం ఆమె 50 కేజీల కన్నా కొన్ని గ్రాముల బరువు అధికంగా తూగింది. దాంతో అనర్హత విధించారు"**

## వినేశ్ ఫోగట్‌పై వేటు బాధపెడుతోంది




- ప్రధాని మోడీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

వినేశ్ ఫోగట్ డిస్క్వాలిఫై అయిన నేపథ్యంలో.. భారత ప్రధాని నరేంద్ర మోడీ స్పందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వినేశ్, నువ్వ చాంపియన్లకే చాంపియన్ అంటూ ఆయన కామెంట్ చేశారు. భారత దేశానికి గర్వకారణమని, ప్రతి ఒక్క భారతీయుడికి ప్రేరణగా నిలుస్తున్నావని తెలిపారు.నిజానికి వేటు పడడం అది ఎంతో బాధిస్తుందన్నారు. చాలా నిరాశకు లోన య్యానని, ఆ విషయాన్ని మాటల్లో చెప్పలేమ న్నారు. నువ్వు మరింత పట్టుదలతో రాణిస్తావని ఆశిస్తున్నట్లు చెప్పారు. సవాళ్లను ఎదుర్కోవడం నీ నైజమని ఆయన అన్నారు. మరింత బలంతో పుంజుకోవాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. నీకు మేం అందరం సపోర్టుగా ఉంటామని మోడీ తన ట్వీట్‌లో వెల్లడించారు.

వినేశ్ విషయంలో భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో ప్రధాని మోడీ ఫోన్లో మాట్లాడారు. అసలు ఏం జరిగిందో ఆయన అడిగి తెలుసుకున్నారు. అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం వద్ద తమ నిరసన వ్యక్తం చేయాలని పీటీ ఉషను మోడీ కోరినట్టు తెలుస్తోంది.

## వయనాడ్ బాధితులకు ప్రభాస్ భారీ విరాళం



**బలగం టీవీ, హైదరాబాద్**

వయనాడ్ విపత్తు బాధితుల సహాయార్థం కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి రెబల్ స్టార్ ప్రభాస్ 2 కోట్ల రూపాయల విరాళం ప్రకటిం చారు. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి 360 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. విపత్తు బాధితులకు అండగా నిలబడేందుకు సినీ పరిశ్రమలోని పలువురు స్టార్స్ విరాళాలు ఇస్తున్నారు.ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు సాయం ప్రకటించారు. ఇప్పుడు ఈ జాబితాలో ప్రభాస్ కూడా చేరారు. ఇటీవల మోహన్ లాల్ రూ.3 కోట్లు ఇచ్చారు. మెగాస్టార్ చిరంజీవి, మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్ రూ.కోటి విరాళాన్ని ప్రకటించారు. అల్లు అర్జున్ రూ.25 లక్షలను కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా ఇచ్చారు.

నయనతార, విఘ్నేశ్ దంపతులు రూ.20 లక్షలు, హీరో విక్రమ్ రూ.20 లక్షలు, హీరో సూర్య, జ్యోతిక, కార్తి సంయుక్తంగా రూ.50 లక్షలు అందించారు. నటులు మమ్ముట్టి, దుల్కర్ సల్మాన్ కలిసి రూ.35 లక్షలు, ఫహాద్ ఫాజిల్ రూ.25 లక్షలు ఇచ్చారు. హీరోయిన్ రష్మిక రూ.10 లక్షలు ఇచ్చారు.



## ఫొగాట్‌పై అనర్హత వేటు.. లోక్‌సభలో ప్రకటన

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పారిస్ ఒలింపిక్స్‌లో రెజ్లింగ్ ఫైనల్‌కుచేరిన వినేశ్ ఫొగాట్ పై అనర్హత వేటు పడగా ఈ అంశంపై లోక్‌సభలో కేంద్రం ప్రకటన చేసింది. బుధవారం వినేశ్ ఫొగాట్ అనర్హత అంశంపై పార్లమెంట్‌లో చర్చకు విపక్ష ఇండియా కూటమి పార్టీల ఎంపీలు పట్టుబడ్డాయి. ఈ నేపథ్యంలో ఫొగాట్ అనర్హతపై కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ లోక్‌సభలో ప్రకటన చేశారు. 100 గ్రాముల అదనపు బరువు కారణంగా వినేశ్ అనర్హతకు గురైనట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ వద్ద భారత ఒలింపిక్ సంఘం తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు వెల్లడించారు.

'ఈ రోజు వినేశ్ ఫొగాట్ బరువు 50 కిలోల 100 గ్రాములు ఉన్నట్లు గుర్తించారు. దీంతో రెజ్లర్ అనర్హతకు గురయ్యారు. ఈ వ్యవహారంపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ వద్ద భారత ఒలింపిక్ సంఘం తీవ్ర నిరసన తెలియజేసింది. ఐవోఏ అధ్యక్షురాలు పీటీ ఉష ప్రస్తుతం పారిస్‌లోనే ఉన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఐవోఏ అధ్యక్షురాలితో మాట్లాడారు. ఈ అంశంపై అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రధాని సూచించారు. వినేశ్ ఫొగాట్ సన్నద్ధత కోసం కేంద్రం అన్ని రకాల సాయాన్ని అందించింది' అని మాండవీయ లోక్‌సభలో వెల్లడించారు.



**మిల్కీ బ్యూటీ తమన్నా మరో ప్రాజెక్ట్?కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రీతీ సిమోస్ నిర్మించనున్న ఓ కొత్త ఓటీటీ సిరీస్‌లో మిల్కీ బ్యూటీ కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. నిజ జీవిత సంఘటనల ఆధారంగా రానున్న ఈ సిరీస్‌లో తమన్నా న్యాయవాదిగా కనిపించబోతున్నట్టు వినికిడి. గతేడాది తమన్నా - ప్రీతి సిమోస్? కాంబోలో ఆఖరి సచ్ అనే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ వచ్చి మంచి హిట్ అందుకుంది. ఇప్పుడీ కొత్త ప్రాజెక్టును కరణ్ జోహార్‌తో కలిసి నిర్మించనున్నట్లు ప్రీతి తెలిపింది. దేశమంతా ఉలిక్కిపడేలా చేసిన ఓ కేసుతో ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నట్లు తెలిపింది. కాగా, త్వరలోనే ఈ ప్రాజెక్టు చిత్రీకరణ మొదలుకానున్నట్లు సిరీస్ సన్నిహిత వర్గాలు చెప్పాయి. ఇకపోతే ప్రస్తుతం తమన్నా తెలుగు చిత్రం ఓదెల 2 షూటింగ్‌తో బిజీగా ఉంది.** బలగం టీవీ, హైదరాబాద్



## గేమ్ ఛేంజర్ డబ్బింగ్ షురూ..

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాపవర్ స్టార్ రామ్‌చరణ్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ కాంబోలో గేమ్ ఛేంజర్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రామ్ చరణ్ కు సంబంధించిన షూట్ కూడా కంప్లీట్ అయ్యింది. దాదాపు 90 శాతం ఈ మూవీ షూటింగ్ కూడా పూర్తైంది. దీంతో ఈ చిత్రం నుంచి అప్డేట్స్ కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా మేకర్స్ అప్డేట్ ఇచ్చారు. బుధవారం ఈసినిమా డబ్బింగ్ పనులు ప్రారంభమయ్యాయని తెలుపుతూ ఫోటో షేర్ చేశారు.కాగా ఈ సినిమా క్రిస్మస్ కానుకగా విడుదల చేయనున్నట్లు నిర్మాత దిల్ రాజ్ ప్రకటించిన సంగతి తెలిసందే. ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎస్‌జే సూర్య, నవీన్ చంద్ర, శ్రీకాంత్, సముద్రఖని, జయరామ్, సునీల్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 'గేమ్ ఛేంజర్'ను గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.

